టీటీడీ ఉద్యోగిగా.. : 1978లో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టులో గాయకుడిగా చేరిన గరిమెళ్ల 2006 వరకు సేవలందించారు. అన్నమాచార్య సంకీర్తనల స్వర కల్పన.. సంగీత స్వరాలతో కూడిన పుస్తకాల ముద్రణ.. రికార్డింగ్‌లో పాలుపంచుకున్నారు. ఈ ప్రాజెక్టు అదనంగా గరిమెళ్ల సంగీత పాండిత్యాన్నీ వెలుగులోకి తెచ్చింది. 2012 నుంచీ 2023 వరకూ టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా గౌరవానికి నోచుకున్నారాయన.

వినరో భాగ్యము

.. అంటూ వినువీధుల్లోకి

● మూగబోయిన గరిమెళ్ల మధురగళం

'వినరో భాగ్యము విష్ణు కథ..' అంటూ వేంకటపతి చరిత చెప్పిన స్వరం వైకుంఠం చేరింది.
'దాచుకో నీపాదాలకు దగనే జేసిన పూజలివి.. అంటూ శ్రీనివాసుడిని ఆర్తితో అర్చించిన గానం సప్తగిరులను ఆవహించింది.

టీటీడీ ఆస్థాన విద్వాంసుడు, మధుర గాయకుడు, అద్భుత స్వరకర్త గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్(76) ఆదివారం సాయంత్రం తిరుపతిలో గుండెపోటుతో కన్నుమూశారు. బుధవారం ఆయనకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన లేకున్నా.. ఆయన కీర్తనలు మాత్రం తెలుగు గడ్డపై వినిపిస్తూనే ఉంటాయని ప్రముఖులు నివాళులర్పించారు.









సంగీతానికి అంకితమైన పుంభావ సరస్వతిగా పేరు తెచ్చుకున్న గరిమెళ్ల 1948 నవంబరు 9న రాజమహేంద్రవరంలో జన్మించారు. ప్రఖ్యాత నేపథ్య గాయని ఎస్.జానకి ఆయనకు స్వయానా పిన్ని. నేదునూరి, పశుపతి, మంగళంపల్లి వీరికి గురువులైనప్పటికీ గరిమెళ్ల బాణీ.. ఈ ముగ్గురు త్రిమూర్తుల మేలు కలయిక అని సంగీతప్రియులు చెప్పుకుంటుంటారు. నేదునూరి వారిలోని రాగభావం, పశుపతి గాత్రంలోని శ్రుతిశుద్ధం, బాలమురళి వాణిలోని లాలిత్యం కలబోసిన బాణి ఆయనది.

స్వరాలతో నవ్యశోధన : అన్నమయ్య చేసిన పదార్చనకు గరిమెళ్ల రాగాలు బంగారానికి తావి అనిపిస్తాయి. 150కి పైగా రాగాలను తీసుకొని, వెయ్యికుపైగా సంకీర్తనలకు వైవిధ్యభరితంగా బాణీలు కట్టిన ఘనత గరిమెళ్లది.
ఆయన స్వరపరచిన అన్నమయ్య సంకీర్తన వింటుంటే, సాహిత్యం, దానికి తగ్గ సంగీతం జతగా కలసి మెలసి అన్నమయ్య మనతో మాటాడుతున్నారా అనిపిస్తుందంటే అతిశయోక్తిలేదు.

మోహన, హిందోళ, శుద్ధధన్యాసి వంటి రాగాలలో సాధారణంగా ఎవరు స్వరపరచినా పరిమితమైన అవే సంగతులు కనబడతాయి. కానీ గరిమెళ్ల ఒకదానికొకటి భిన్నమైన స్వరప్రయోగాలతో, సాహిత్యంలో ఒదిగిపోయే విధంగా స్వరం సమకూర్చటం విశేషం. ఔడవ (5 స్వరాల) రాగాలలోనే ఆయన అధిక భాగం స్వరపరిచారు. ఇక, అయన సృష్టించిన రాగాల విషయానికొస్తే సుందరరంజని, వాణీప్రియ, చిత్రకల్యాణి వంటి రెండుపదుల రాగాలను, వినూత్న భావావిష్కరణలకు ఆలవాలమయేట్లు ఆయన సృజించారు. ఇది ఆయన మరో నవ్యశోధన.

సంకీర్తన యజ్ఞ ప్రక్రియకు ఆద్యుడు

సంకీర్తన యజ్ఞ ప్రక్రియకు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌ను ఆద్యుడిగా పరిగణిస్తారు. ఓ గాయకుడు ఒకే రోజు ఒకే వేదికపై అనేక కీర్తనలు ఆలపించడాన్ని సంకీర్తన యజ్ఞంగా పిలుస్తారు. 1997లో విశాఖలోను, 1999లో విజయవాడలోనూ ఆయన ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించి 200కు పైగా కీర్తనలు ఆలపించారు. 2001లో తిరుపతిలో 300 కీర్తనలు పాడారు. 2003, 2007లలో హైదరాబాదులోనూ, 2008లో విజయవాడలోనూ, 2009లో హైదరాబాదులో, 2011లో కాకినాడలో, 2012లో తిరుపతిలో యజ్ఞ ప్రక్రియ కార్యక్రమాలు నిర్వహించి ఆయాచోట్ల 200కు పైగా కీర్తనలు ఆలపించారు.


భర్త భౌతికకాయం వద్ద విలపిస్తున్న రాధ

కొండపై ఏమూల ఉన్నా.. ఆయన గానం చెవిన పడాల్సిందే

గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ శివపదు కీర్తనలను స్వరపరచి ఆలపించడం కూడా. దాదాపుగా 150 శివపద కీర్తనలను స్వరపరచి ఆలపించారు. అవి నిజంగా ఆణిముత్యాలే. మధుర భావ తరంగాలే. ఆయన స్వరసహితంగా వెలువరించిన స్వీయ రచిత ఆంజనేయ కృతిమణిమాల, వినాయక కృతులు, నవగ్రహ కృతులు,"సర్వదేవతా స్తుతి రచనలు. ఇలా అనేకం బహుళ జనాదరణ పొందాయి. గరిమెళ్ళవారి గళం వినబడని ఆకాశవాణికేంద్రం లేదు. భక్తిరంజని కార్యక్రమం లేదు. దేశమంతటా పర్యటించి 'అన్నమయ్య నాదయజ్ఞాలు' ఎన్నో విజయవంతంగా నిర్వహించారు. ఆయన పలుకు ఎంత మంద్రమో గానమంత మార్దవం. అనవసర విన్యాసాలకు, ఆడంబర విద్వత్వ ప్రదర్శనలకు ఆయన దూరంగా ఉంటారు. తిరుమలకొండపై ఏమూల ఉన్నా, ఏ చోటనున్నా, గాలిఅలలపై తేలివచ్చే గరిమెళ్ళవారి గళం చెవికి సోకగానే, మధురానంద భరితుడవటం తథ్యం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


గరిమెళ్ల భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీపీఆర్వో రవి తదితరులు

గరిమెళ్లకు అనేక పురస్కారాలు

సంప్రదాయ కర్ణాటక సంగీతంలో విద్వాంసుడిగా పేరు మోసిన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌ను పలు ప్రైవేటు, ప్రభుత్వ, ఆధ్యాత్మిక సంస్థలు పురస్కారాలతో గౌరవించాయి. ఆయనకు దక్కిన వాటిలో 2020లోని కేంద్ర సంగీక నాటక అకాడమీ పురస్కారం ముఖ్యమైనది. ఆయన అసాధారణ సేవలను గుర్తించి టీటీడీ వెండి పతకం, ప్రశంసా పత్రంతో సత్కరించింది. 2001లో టీటీడీ, లలిత కళా అకాడమీలు సంయుక్తంగా పురస్కారం ప్రదానం చేయగా 2007లో ఏపీ ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించింది. 2009లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం మ్యుజీషియన్ ఆఫ్ ది ఇయర్ విశిష్ట పురస్కారం.. 2010లో చెన్నైకి చెందిన రాజ్యలక్ష్మి ఫౌండేషన్ పురస్కారం ప్రకటించాయి.


గాయని, పిన్ని అయిన ఎస్.జానకితో బాలకృష్ణ ప్రసాద్

తెప్పపై శ్రీరామచంద్రమూర్తి



తిరుమలలో ఆదివారం సాయంత్రం శ్రీవారి తెప్పోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు.. సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లను మాడవీధుల ఊరేగింపుగా తీసుకొచ్చి పుష్కరిణిలోని తెప్పపై ఆశీనులను చేశారు. మూడుచుట్లు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



రుయాలో గంటపాటు అంధకారం

- ముందే చెప్పి సరఫరా ఆపిన డిస్కం అధికారులు
- జనరేటర్‌ను సిద్ధం చేసుకోవడంలో ఆస్పత్రి వర్గాల వైఫల్యం
- వెంటిలేటర్లపై రోగుల అవస్థలు

తిరుపతి(వైద్యం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రుయాలో ఆదివారం ఉదయం గంటపాటు విద్యుత్తు సరఫరాలేక అంధకారం నెలకొంది. కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ముందే చెప్పినా జనరేటర్‌ను సిద్ధం చేసుకోవడంలో అధికారులు విఫలమవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న.. వెంటిలేటర్లపై ఉన్న రోగులు ఇబ్బంది పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. విద్యుత్తు మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటలకు సరఫరాను నిలిపేస్తున్నట్లు రుయాస్పత్రిలోని విద్యుత్తు విభాగ సిబ్బందికి శనివారం సమాచారం ఇచ్చారు. ఆ వెంటనే ఆస్పత్రిలో జనరేటర్‌ను సిద్ధం చేసుకోవాల్సిన విద్యుత్తు సిబ్బంది ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. జనరేటర్ మరమ్మతులకు గురైన విషయాన్నీ రుయా అధికారుల దృష్టికి తీసుకెళ్లలేదు. ఆదివారం ఉదయం 9 గంటలకు సరఫరా ఆగడంతో ఆస్పత్రి అంధకారంతో నిండిపోయింది. అరగంట గడిచినా అత్యవసర విభాగం, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్ వంటి వార్డుల్లో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో రోగుల పరిస్థితి గందరగోళంగా మారింది. ఈ విషయాన్ని వార్డుల్లోని సిబ్బంది రుయా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు. జనరేటర్ మరమ్మతులకు గురై ఉండటంతో విద్యుత్తు సరఫరా నిలిచిన వెంటనే సరఫరా చేయడానికి వీలు కాలేదని రుయాలోని విద్యుత్తు సిబ్బంది అధికారులకు వివరించారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని ముందుగానే తెలిసినా ఎందుకు జనరేటర్‌ను సిద్ధం చేసుకోలేదని సూపరింటెండెంట్ రవిప్రభ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.జనరేటర్ పనిచేయడం లేదనే విషయాన్ని తమ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని మండిపడ్డారు. అప్పటికే పలు వార్డులో వెంటిలేటర్లపై ఉన్న రోగుల పరిస్థితి గందరగోళంగా మారడంతో అక్కడి సిబ్బంది,డాక్టర్లు ఆ విషయాన్ని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువచ్చారు. అప్పటికప్పుడే జనరేటర్‌కు మరమ్మతులు చేపట్టి పది గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.

ఆ గంటలో ఇద్దరు శిశువుల మృతి!

ఆదివారం ఉదయం 9-10 గంటల మధ్య, విద్యుత్తు సరఫరా లేని సమయంలో రుయాలోని చిన్నపిల్లల విభాగంలో వెంటిలేటర్‌పై ఉన్న ఇద్దరు శిశువులు మృతి చెందినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న అధికారులు చిన్నపిల్లల విభాగానికి చేరుకొని మృతిచెందిన శిశువులను పరిశీలించాక.. మిగతా వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ శిశువుల మృతి అనారోగ్యం వల్లే కానీ.. కరెంటు లేక కాదని వైద్యవర్గాలు అంటున్నాయి.

మద్యం మత్తులో బాబాయి, అబ్బాయి ఘర్షణ

● రోకలితో తలపై మోదడంతో అబ్బాయి మృతి

పుత్తూరు అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో జరిగిన చిన్నపాటి గొడవ హత్యకు దారితీసింది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం పుత్తూరు పరిధిలోని చినరాజుకుప్పంలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అన్నదమ్ములైన సుబ్బరాయుడు, వెంకటేష్ పక్కపక్క ఇళ్లలోనే ఉంటున్నారు. సుబ్బరాయుడి కుమారుడు మణికంఠ తిరుపతిలోని ఓ బార్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం కావడంతో చిన్నాన్నతో కలిసి ఆయన ఇంట్లోనే మద్యం తాగారు. ఆ మత్తులో గొడవపడ్డారు. ఈ ఘర్షణలో వెంకటేష్ రోకలితో మణికంఠ తలపై బలంగా మోదాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఘటనా స్థలంలోనే మణికంఠ అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఎంతకీ కొడుకు రాకపోవడంతో అతడి తల్లి పక్కనే ఉన్న ఇంటికెళ్లి వెళ్లికి చూసింది. వెంకటేష్ మద్యం మత్తులో తూలుతుండగా, కొడుకు ఉలుకూపలుకూ లేకుండా రక్తంలో పడి ఉండడంతో గ్రామస్తుల సాయంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది మణికంఠను పరీక్షించి మృతి చెందినట్టు ధృవీకరించారు. మణికంఠపై దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మణికంఠకు భార్య జనని, రెండేళ్ల కొడుకు ఉన్నాడు. ప్రస్తుతం ఆమె గర్భిణి. వయసు మీరిన తల్లిదండ్రులకు, కుటుంబానికి మణికంఠ సంపాదనే ఆధారం. తన భర్త మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద జనని భోరున విలపించింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మణికంఠ (ఫైల్ ఫొటో)

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం) : 6.25
సహరి (మంగళవారం) : 5.04

గ్రానైట్, ఇసుక మాఫియాపై విజి'లెన్స్'

తిరుపతి(నేరవిభాగం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో సాగిన మైనింగ్, ఇసుక అక్రమాలపై విజిలెన్స్ దృష్టి పెట్టింది. అప్పట్లో పంచాయతీల అంగీకార తీర్మానాలూ లేవు. రాయల్టీగా రూపాయి కూడా చెల్లించలేదు. అధికారికంగా రెట్టింపు ప్రదేశంలో క్వారీ నిర్వహణకు, క్రషర్లకు అనుమతి లేకపోవడం.. క్రషర్ నుంచి వెళ్లే లోడ్లకు జీఎస్టీ చెల్లించలేదన్న విమర్శలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక కొందరు నేతలతో సఖ్యతగా ఉంటూ, వారి సహకారంతో అక్రమ మైనింగ్ సాగిస్తున్నారన్న విమర్శలున్నాయి. దీనిపై ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు.. మరికొందరు ప్రభుత్వ పెద్దలకు, విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఈ వ్యవహారంపై దృష్టి పెట్టారు. నాయుడుపేట, సత్యవేడు, తిరుపతి రూరల్, సూళ్లూరపేట వంటి ప్రాంతాల్లో నిఘా వుంచి క్వారీల నుంచి రవాణా చేస్తున్న కంకర, ఇసుక అక్రమ రవాణా చేస్తున్న భారీ వాహనాలు ఆపి బిల్లులు తనిఖీ చేయనున్నారు. ఎక్కడ లోడింగ్ చేశారు? ఎక్కడికి తీసుకెళ్తున్నారు? అనుమతించిన ప్రాంతాల్లోనే నిర్వహిస్తున్నారా? అనే విషయాలపైనా లోతుగా ఆరా తీయనున్నారు.

కాలినడక భక్తులకు ఉపశమనం

● అలిపిరి మార్గంలో తాత్కాలిక పైకప్పు ఏర్పాటు

తిరుమల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అలిపిరి మార్గంలో నడక భక్తులకు వేసవి నుంచి ఉపశమనం కలిగింది. టీటీడీ తాత్కాలిక పైకప్పును ఏర్పాటు చేసింది. శ్రీవారి భక్తుల్లో 30 నుంచి 40 శాతం మంది ఈ మార్గంలోనే వస్తుంటారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి మోకాలిమిట్ట వరకు దాదాపు 1.6 కిలోమీటర్ల మేర మొదటిఘాట్ రోడ్డు వెంబడే నడవాలి. కాలినడక మొక్కుకావడంతో పాదరక్షలు లేకుండానే భక్తులు వస్తుంటారు. దాదాపు కిలోమీటరు వరకు శాశ్వత షెడ్డు ఉన్నప్పటికీ మరో 600 మీటర్ల మేర ఎండకు కాలుతున్న రోడ్డుపైనే నడవాల్సి వస్తుంది. ఈ క్రమంలో టీటీడీ ఇంజినీరింగ్ విభాగం జర్మన్ షీట్లతో తాత్కాలిక పైకప్పును ఏర్పాటు చేసింది. దీంతో భక్తులకు వేసవి నుంచి కాస్త ఊరట లభిస్తోంది.



'యాంత్రీకరణ' కింద రైతులకు సబ్సిడీ యూనిట్లు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ.282కోట్లతో యాంత్రీకరణ పథకం కింద రైతులకు 1,614 యూనిట్లు కేటాయించినట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బ్యాటరీ ఆపరేటర్ నాప్‌స్టాక్, పవర్ ఆపరేటర్ స్ప్రేయర్, ట్రాక్టర్ ఆపరేటర్ స్ప్రేయర్, ట్రాక్టర్ డ్రోన్ ఇంప్లిమెంట్, ఆరు లెవలింగ్ బ్లేడ్స్, రోటవేటర్స్, పవర్ విండోస్, బ్రష్ కట్టర్స్, పవర్ ఫిల్లర్స్ రైతులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రంలో వీటిని సబ్సిడీపై అందిస్తామన్నారు. మరింత సమాచారం కోసం రైతు సేవా కేంద్రాల్లోని అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఆహార శుద్ధి యూనిట్లకు ప్రభుత్వ ప్రోత్సాహం

● పీఎంఎఫ్‌ఎంఈ కింద 35శాతం రాయితీ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆహారశుద్ధి యూనిట్లకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వం 35శాతం రాయితీ, 55శాతం బ్యాంకు రుణం సమకూర్చుతుందన్నారు.ఉత్పత్తుల నాణ్యత ఆధారంగా మార్కెట్‌లో బ్రాండ్ సృష్టించుకునే అవకాశం ఉందని చెప్పారు. ఇప్పటికే యూనిట్లు ఉన్నా రుణం తీసుకుని విస్తరించుకోవచ్చన్నారు. పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద చిన్న మొత్తంలో యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. గరిష్టంగా రూ.10లక్షల వరకు రాయితీ పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాల కోసం 77991 28020, 89782 92970 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. పొదుపు సంఘాల మహిళలకు ఒక్కొక్కరికి రూ.40వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. ముడిసరుకు, ప్యాకింగ్, ఇతరాత్ర పెట్టుబడిగా ఉపయోగించుకుని తరువాత పొదుపు సంఘానికి చెల్లించాలి.వీరు కూడా 35 శాతం రాయితీపై రుణం తీసుకుని యూనిట్ విస్తరించుకోవచ్చు.జిల్లా, మండల స్థాయిలోని రిసోర్స్ పర్సన్స్ ద్వారా వివరాలు తీసుకోవచ్చు.18 ఏళ్ల నిండిన వారు యూనిట్ వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. ఆధార్, పాన్ కార్డు, యూనిట్ చిరునామా పత్రం తదితర వివరాలను అప్‌లోడ్ చేయాలి.

మార్చిలోనే మండుతోంది





మార్చి ఆరంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. మే నెలలో కనిపించే దృశ్యాలు తిరుపతి నగరంలో అప్పుడే దర్శనమిస్తున్నాయి. గరుడవారధి పుణ్యమా అని తిరుమల బైపాస్ రోడ్డులో నీడ ఉన్నాపైన మాత్రం నెత్తి మాడిపోతోంది. నగరంలోని ప్రధాన మార్గాలు నడి ఎండవేళ నిర్జనంగా మారుతున్నాయి. బజార్లలో గుడ్డ ముసుగుల్లో మనుషులు తిరుగుతున్నారు. కూరగాయల మార్కెట్ గొడుగు నీడకిందకు చేరిపోయింది. రోడ్డు పక్కన మట్టి కుండల అమ్మకాలు పెరిగాయి. రిపేర్ల కోసం కూలర్లు ఇళ్లు దాటుతున్నాయి. ఆదివారం తిరుపతిలో ఎండవేళ కనిపించిన దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ అందిస్తున్నారు..

- తిరుపతి అర్బన్,ఆంధ్రజ్యోతి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పలువురికి సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

తిరుచానూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో వివిధ సమస్యలతో బాధపడుతున్న పలువురికి సీఎం సహాయనిధి నుంచి రూ.25.50లక్షలను రఘునాథ్ రిసార్ట్సులో ఆదివారం ఎమ్మెల్యే పులివర్తి నాని పంపిణీ చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తమకు తక్షణమే స్పందించిన సీఎం చంద్రబాబునాయుడు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించిన ఎమ్మెల్యే పులివర్తి నానికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో కేంద్రమంత్రి ఎస్పీసింగ్ బఘేల్



ఆలయం వద్ద కేంద్రమంత్రి ఎస్పీసింగ్ బఘేల్

తిరుచానూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం కేంద్రమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి అనంతరం సన్నిధిలో అమ్మవారి మూలవర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం కేంద్రమంత్రిని వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఘనంగా ధ్వజస్తంభ మహాకుంభాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న సుధారెడ్డి

పాకాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కేవడ్డపల్లె పంచాయతీ అమ్మగారిపల్లె దొనకొండ గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ మహాకుంబాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కె సావిత్రి, నాయకులు బి.మహేష్ కుమార్, సుధాకర్ నాయుడు, జెజబ్బనాయుడు, దామోదరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు

భాకరాపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో సత్యనారాయణ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట గీతాంజలి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అపుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటరమణా రెడ్డి, కార్యదర్శి రవీంద్రనాథరెడ్డి, భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర, సర్పంచ్ భూపాల్, కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి, హెచ్ఎం స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమి ఆక్రమణయత్నం

చెరువుపోరంబోకు స్థలంలో తోలిన ఎర్రమట్టి



తిరుపతి రూరల్, మార్చి9(ఆంధ్రజ్యోతి): సి.మల్లవరం పంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌లో సర్వేనంబరు 326లోని చెరువు పోరంబోకు స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయరహదారికి ఆనుకుని ఉన్న విలువైన భూమిలో టిప్పర్లతో ఎర్రమట్టిని గుట్టలు గుట్టలుగా తోలించారు. ఈభూమి విలువ దాదాపు రూ.2కోట్ల వరకు ఉంటుందంటున్నారు. నాలుగునెలల క్రితం ఇదే స్థలానికి సమీపంలోని ప్రభుత్వ స్థలంలో ఆక్రమణదారులు రేకుల షెడ్డులను నిర్మించారు. మీడియాలో కథనాలు రావడంతో తహసీల్దార్ రామాంజులునాయక్ స్పందించి.. ఆక్రమణల తొలగించారు. తాజాగా విలువైన ఖాళీస్థలంపై ఆక్రమణదారుల కన్నుపడింది. జాతీయరహదారి విస్తరణ పనుల మాటున ఆక్రమించేందుకు ఆక్రమణదారులు తెరలేపారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

పాకాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మొగరాలలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పూజలు చేసి పనులను ప్రారంభించారు. మొగరాల, కృష్ణాపురం, చల్లావారిపల్లె, రమణయగారిపల్లె, తోటతిమ్మయ్యగారిపల్లె పరిసర గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరాకు ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఎన్నికల సమయంలో లో వోల్టేజి సమస్య పరిష్కరించాలని ఇక్కడి ప్రజలు ఎమ్మెల్యే నాని దృష్టి తీసుకెళ్లారు. హామీ నెరవేరుస్తున్నందుకు ఆయనకు ఈప్రాంతవాసులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ సురేంద్రనాయుడు, ఈఈలు బాలాజీ, చిన్నరెడ్డప్పరెడ్డి, డీఈలు జీవన్ కుమార్, భాస్కర్ నాయుడు, ఏఈలు హరిప్రసాద్, రవిచంద్రబాబు, సర్పంచ్ మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన



తిరుచానూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా చెన్నైకు చెందిన ఎస్కే నాట్య కళా నికేతన్ అకాడమీకి చెందిన కళాకారులు ఆదివారం ప్రదర్శించిన నృత్యం అలరించింది. కళాకారులు అపర్ణ శ్రీ హంసిక, వర్షిణి చెరెడ్డి, లోహిత్య, నవ్యశ్రీ, సంప్రీతా, లక్షిత, హర్షవర్ధిని, ప్రాణమయి, జస్మిత తదితరులు పుష్పాంజలి, సలంగ కత్తి, భాగ్యదా లక్ష్మి, బ్రమ్మ ఒకటే, గరుడ గమనే, మహాభారత శబద్ధం, ఆండాల్ కౌత్వం వంటి కీర్తనలకు భరతనాట్య ప్రదర్శన చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

రెచ్చిపోతున్న గంజాయి బ్యాచ్

● రెండు రోజుల క్రితం మధ్యాహ్నం వేళ ఐఎస్ మహల్ వద్ద వున్న ఆటోస్టాండు వద్ద ఒక యువకుడు మద్యం.. గంజాయి మత్తులో మహిళలపై దౌర్జన్యానికి దిగాడు. కొందరు ఆటో డ్రైవర్లు అతడిని పట్టుకుని అదుపు చేస్తున్నా ఏ మాత్రం తగ్గలేదు. ఓ మహిళకు స్వల్ప గాయాలయ్యాయి.

● శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఆర్టీసీ బస్టాండుకు బయట జీవకోన, లీలామహల్ ఆటో స్టాండు వద్ద గంజాయి మత్తులో నలుగురు యువకులు రెండు వర్గాలుగా విడిపోయి కట్టుకొన్నారు. 'ప్లీజ్ నన్ను వదిలేయండి.. వదిలేయండి' అంటూ వేడుకుంటున్నా స్పృహ తప్పే వరకు ప్రత్యర్థి యువకుడిని కొట్టారు.

ఇలా తిరుపతిలో గంజాయి బ్యాచ్ రెచ్చిపోతోంది. పోలీసులు పట్టుకున్నా.. మళ్లీ బయటకు వచ్చేస్తాం కదా అన్న ధీమాతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికి నిదర్శనమే మూడు రోజుల వ్యవధిలోనే రెండు చోట్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడటం.ఇలాంటి ఘటనలు ఎక్కువగా బాలాజీ కాలనీలోని టౌన్ క్లబ్ ప్రాంతంలోని ఓ టీ దుకాణం, చెన్నారెడ్డి కాలనీ, ఎస్టీవీ నగర్, మధురానగర్, జీవకోన, మంగళం, దామినేడు, పాడిపేట, ముళ్ళపూడి, రైల్వే కాలనీ, చేపల మార్కెట్, దేవేంద్ర థియేటర్, వెంకటేశ్వర థియేటర్ ప్రాంతాల్లో జరుగుతున్నాయి. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిన కొందరు పోలీసులు.. గంజాయి బ్యాచ్, మందుబాబుల పట్ల ఉదాసీనత చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప పోలీసులు వారి జోలికి వెళ్లని పరిస్థితి. ప్రధానంగా గంజాయి కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్ళి వచ్చిన వారు, పాత నేరస్థులు, దారి తప్పిన ఆకతాయిలతో నిత్యం తిరుపతిలో పోలీసులకు తలనొప్పిగా మారింది.ప్రధానంగా మద్యం దుకాణాలు, బార్లు వద్ద ఇలాంటి ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. రాత్రి 9 గంటల నుంచి తిరుపతిలోని లీలామహల్ సర్కిల్, ఐఎస్ మహల్, కొర్లగుంట రోడ్డు, డీబీఆర్ ఆసుపత్రి రోడ్డు, తిరుచానూరు రోడ్డు, ఎయిర్ బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో కొందరు రోడ్ల పక్కనే మద్యం తాగుతున్నారు. దీనిపై రాత్రి గస్తీ పెంచాల్సిన అవసరం వుంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఒంటరి ఏనుగు దాడిలో యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న ఉమాపతి

యాదమరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఒంటరి ఏనుగు దాడిలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండల పరిధిలో దళవాయిపల్లెకు చెందిన మణి కుమారుడు ఉమాపతి(25), వంశీకృష్ణ అనే యువకులు ఆదివారం రాత్రి గ్రామ సమీపంలోని పొలంలో ఉన్న పశువుల పాక వద్దకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లగానే చీకటిలో ఒంటరి ఏనుగు తొండంతో దాడి చేసింది. దీంతో ఉమాపతి కిందపడగా, ఆ ఏనుగు తొక్కడంతో గాయాలయ్యాయి. వంశీకృష్ణ తప్పించుకున్నాడు. ఈ విషయాన్ని కుటుంబీకులు, గ్రామస్తుల సహకారంతో అటవీశాఖ సిబ్బందికి తెలియజేశారు. బోడబండ్ల బీట్ ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది, గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ ఉమాపతికి యాదమరి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించాక చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కొంతకాలంగా 14 ఏనుగుల గుంపు బంగారుపాళ్యం, యాదమరి మండలాల పరిధిలో సంచరిస్తూ పొలాలపై దాడులు చేస్తున్నాయి. ఈ గుంపు నుంచి విడిపోయిన ఏనుగు ఈ దాడిచేసి ఉంటుందని అధికారులు అంచనాకు వచ్చారు.

పొలాల్లో స్పృహ కోల్పోయిన నెమళ్లు

పంటలకు పిచికారీ చేసిన మందులే కారణమన్న పశువైద్యులు



నెమళ్లకు చికిత్స చేస్తున్న పశువైద్యులు

పుంగనూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పంటలకు పిచికారీ చేసిన మందుల కారణంగా రెండు నెమళ్లు పొలాల్లో స్పృహ కోల్పోయాయి. పుంగనూరు మండలంలోని రాగానిపల్లె పంచాయతీ చెర్లోపల్లె సమీపంలోని ఓ రైతు పొలం వద్ద రెండు నెమళ్లు పడి ఉన్నాయి. గుర్తించిన పక్క పొలం రైతు అశోక్ వెంటనే చంద్రమాకులపల్లె అటవీ శాఖ బీట్ అధికారి కిషోర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సంఘటన స్థలానికి చేరుకుని స్పృహ కోల్పోయి ఉన్న పక్షులను పుంగనూరు ప్రభుత్వ పశువైద్యశాలకు తరలించి, చికిత్సలు అందించారు. పంటలకు చీడపురుగుల మందు పిచికారీ చేయడం వల్ల వాటి నుంచి కిందపడ్డ పురుగులు, కాయలు తినడంతో పక్షుల ఆరోగ్యం దెబ్బతిన్నట్లు పశువైద్యులు తెలిపారని కిషోర్ తెలిపారు. రెండ్రోజులపాటు చికిత్స అందించాక అటవీప్రాంతంలో వదిలేస్తామని చెప్పారు.

ముక్కంటి సేవలో వాసుకి నందన్

శ్రీకాళహస్తి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడి ని ఆదివారం ప్రముఖ సినీనటి వాసుకి నందన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగ తం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనా నంతరం వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.



తిరుచ్చిపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు దర్శనం



చంద్రగిరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకట్ల కైంకర్యాలు పూర్తయ్యాక పునర్వసు నక్షత్రం సందర్భంగా సాయంత్రం కన్నులపండువగా ఉత్సవర్లకు ఊంజల్ సేవను నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేసి మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు సిబ్బంది పాల్గొన్నారు. చంద్రగిరిలోని కోదండరామాలయంలో శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమ ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో పార్థసారథి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణయ్య, అర్చకులు శ్రీనివాసబట్టర్, నరసింహన్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన పదోతరగతి ప్రశ్నపత్రాలు

చంద్రగిరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు ఆదివారం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. మండలంలో చంద్రగిరిలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ, చైతన్య టెక్నోస్కూల్, తొండవాడ, ఎ.రంగంపేట, పనపాకం ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. ఈప్రశ్నా పత్రాలను విద్యాశాఖా అధికారులు భద్రపరిచారు.

నియోజకవర్గ వైసీపీ యువత అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా చంద్రగిరికి చెందిన కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఆపార్టీ నియమించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ ఛైర్మన్, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ మోహిత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

జనసేన పోస్టర్ ఆవిష్కరణ



భాకరాపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను చిన్నగొట్టిగల్లులో ఆ పార్టీ నాయకుడు దూది జశ్వంత్ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న పిఠాపురంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు జరుగుతాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మిశెట్టి రూపేష్, రాజశేఖర్, జయశంకర్, దొరబాబు నాయుడు, మురళీ, భాను, గిరితేజ, బాలు, తదితరులు పాల్గొన్నారు.

మండల గౌడసంఘ అధ్యక్షుడిగా రాచపల్లి దేవరాజులుగౌడ్

రామచంద్రాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల గౌడ సంఘ అధ్యక్షుడిగా రాచపల్లి దేవరాజులుగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బాబుగౌడ్ తెలిపారు. ఆదివారం రాయలచెరువుపేట మాదాసు మురగయ్య గృహంలో మండల కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా అరగొండ నరసింహులుగౌడ్, జడపల్లి మాతయ్య, కోశాధికారిగా మాదాసు మురగయ్య, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీసభ్యులను రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ తుమ్మల చెంగయ్య, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మాదాసు హేమలత గౌడ్, జిల్లా గౌరవాధ్యక్షులు చిరంజీవి గౌడ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు, కుమారస్వామిగౌడ్, చిరంజీవి గౌడ్, మల్లికార్జునగౌడ్, మునిశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సారూ...కాస్త పట్టించుకోండి

ప్రమాదకరంగా మ్యాన్ హోల్



తిరుపతి (జీవకోన), మార్చి 9(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని తిరుమల బైపాస్ రోడ్డు నుంచి సత్యానారాయణపురంకు వెళ్లే రోడ్డులో డ్రైనేజీ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఏ మాత్రం ఏమరపాటుగా వచ్చినా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గంగమ్మ ఆలయానికి రూ. లక్ష విరాళం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి తిరుపతికి చెందిన కుంటుమల్ల గౌతమ్ ఆదివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. విరాళ మొత్తాన్ని ఆలయ నిర్మాణానికి వెచ్చించాలని ఆయన కోరారు. మబ్బు దేవనారాయణరెడ్డి చేతుల మీదుగా ఆలయ ఈవో జయకుమార్‌కు విరాళాన్ని అందించారు.

కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

తిరుపతి(వైద్యం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వైసీపీ నగర అధ్యక్షుడు దినేష్‌రాయల్ డిమాండ్ చేశారు. వైసీపీ నేతలతో కలిసి ఆయన ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు... కూటమి ప్రభుత్వం ఇచ్చిన నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ వంటివి వెంటనే నెరవేర్చాలన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 12న కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నేతలు జీవన్‌సాయి, రాకేష్, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల నిరవధిక సమ్మె



తిరుపతిరూరల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారమూ కొనసాగింది. దీనిలో భాగంగా వర్సిటీ ప్రధానగేటు ఎదురుగా ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో విద్యార్థులు భైఠాయించి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. లైవ్‌స్టాక్ రంగం ద్వారా ప్రభుత్వానికి రూ.60వేల కోట్ల జీడీపీ వస్తుందని..అయితే వెటర్నరీ విద్యార్థులకు మాత్రం రూ.7వేల స్టైఫండ్‌ని అందిస్తున్నారని ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారు. 13సంవత్సరాలుగా రూ.7వేలు మాత్రమే స్టైఫండ్ ఇస్తున్నారన్నారు. తక్షణమే పెంచి తమకు న్యాయం విద్యార్థులు కోరారు.

వసతి గృహానికి వంటపాత్రల వితరణ



తిరుపతి(ఆటోనగర్) మార్చి9(ఆంధ్రజ్యోతి): స్థానిక జీవకోన రోడ్డులోని రీల్ సంస్థ అధ్వర్యంలో కేంద్ర సర్వశిక్ష అభియాన్ నిధుల సహకారంతో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహంలో ఆదివారం తిరుపతి రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వంట పాత్రల హాట్‌బాక్సులు వితరణ చేశారు. స్టీల్ ప్లేట్‌లు, గ్లాసులు, టవల్స్, నోట్‌బుక్స్,పెన్నులు, పెన్సిళ్ళు, వంటసరుకులను వసతి గృహ నిర్వాహకులు సాకం కృష్ణ మూర్తికి అందజేశారు. విశాంత్ర ఉద్యోగుల సంఘం ప్రధానకార్యదర్శి టి.వెంకటేశం శెట్టి మాట్లాడుతూ తమ సంఘంలో కొంత మంది సభ్యులు నెలవారీగా వచ్చే పింఛనులో కొంత మొత్తాన్ని ఇలాంటి సేవా కార్యక్రమాలను వెచ్చిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మునికృష్ణ,రాధాక్రిష్ణ, టి.జయలక్ష్మీ, ఎస్.మొహరున్‌బీ, గురవయ్య, రాజగోపాలాచారి, డి.భాగ్యలక్ష్మీ, జగన్నాథ నాయుడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



రాజ్‌కుమార్‌ను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిట్టు ఖాదిబండార్ అధినేత రాజ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం కరకంబాడీ రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిని అసోసియేషన్ నేతలు, వ్యాపార ప్రముఖులు సత్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అభివృద్ధితో పాటు, వ్యాపారుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ భవన నిర్మాణానికి రూ. 10లక్షలు విరాళం ప్రకటించారు. మరికొందరు కూడా విరాళాలు ప్రకటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు ఆర్.ఎస్.రామిరెడ్డి, రామ్‌గోపాల్, విద్యాసాగర్‌రెడ్డి, రామమూర్తిరెడ్డి, ప్రకాష్, ప్రభాకర్, వీరభద్రరావు, రాజారెడ్డి, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీడీసీఏ వార్షికోత్సవం



బహుమతి అందుకుంటున్న దీక్షిత్

తిరుపతి(క్రీడలు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మల్టీస్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం చిత్తూరు డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాలర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ చిత్తూరుజిల్లా క్రికెట్ అసోసియేషన్ ఏర్పాటుతో క్రీడారంగానికి శుభపరిమాన మన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత క్రికెట్ అభిమానులు హర్షిస్తున్నారన్నారు. అనంతరం సీడీసీఏ చైర్మన్ విజయకుమార్ ఆధ్వర్యంలో అప్‌కమింగ్ ప్లేయర్ బత్తుల దీక్షిత్‌కు పోత్సాహక బహుమతి అందజేశారు. మరికొందరి బాల క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

తిరుపతి

వాకర్స్‌కు పోలీసుల భరోసా



వాకర్స్‌తో మాట్లాడుతున్న సీఐ, పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): వాకింగ్ ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీ నిఘా ఏర్పాటు చేశారు. వాకర్స్‌కు భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పార్కులు, అటవీశాఖ వాకింగ్ ట్రాక్‌లు, టీటీడీ పరిపాలనా భవనం, బైరాగిపట్టెడ పార్కు, ప్రకాశం పార్కు, జగజ్జీవన్ పార్కుతో పాటు పలుచోట్ల భద్రత కల్పిస్తున్నారు. అకతాయిల ఆగడాలు, చైన్ స్నాచింగ్‌లు, పిక్ ప్యాకెట్లు వంటి ఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసులు మఫ్టీలో ఉంటున్నారు. ఇప్పటికే అన్ని స్టేషన్లకు ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలు జారీ చేశారు. . వాకర్స్‌తో పోలీసులు మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్నారు. మద్యం, గంజాయి తాగి ఎవరైనా ఇబ్బంది పెడితే వెంటనే 112 కు కానీ లేకుంటే సమీప స్టేషన్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా స్కూలు వార్షికోత్సవం



సిల్వర్ ఓక్స్ విద్యార్థుల ప్రదర్శన

తిరుపతి(విద్య), మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక భవానీనగర్‌లోని సిల్వర్ ఓక్స్ పాఠశాల వార్షికోత్సవం లా ఫియెస్టా మహతి ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా జరిగింది. పాఠశాల చైర్మన్ కేఎస్ వాసు వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీనివాస కళ్యాణం ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని శిరీష, ప్రైమరీ ఇన్‌చార్జి లావణ్య, కిండర్ గార్టెన్ ఇనచార్జి మంజులాదేవి, పీఆర్ మేనేజర్ హరికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చలో విజయవాడ జయప్రదం చేయండి

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు



పోస్టర్లను విడుదల చేస్తున్న నాగేశ్వరరావు

తిరుపతి(ఆటోనగర్) మార్చి9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికుల టైమ్ స్కేల్ సాధనకు ఈనెల 19న నిర్వహించే ఛలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు కోరారు. తిరుపతిలో జరుగుతున్న సీఐటీయూ నాయకత్వ స్థాయి వర్క్‌షాపులో ఆయన రెండవ రోజు ఆదివారం పాల్గొన్నారు. విజయవాడ కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జీఓ నెంబరు 2ను రద్దుచేస్తూ తీసుకున్న అనాలోచిత నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తే లక్షా 20 వేలమందికి పైగా కార్మికులు నష్ట పోతారని అందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికుల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.చిన్నబాబు, ఎస్.జయచంద్ర, నాగవెంకటేష్, ప్రభాకర్ రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

స్వరకర్త గరిమెళ్ల మృతికి ఘన నివాళులు

●సంతాపం ప్రకటించిన నాయకులు, కళాకారులు, అభిమానుల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ సంగీత విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపాన్ని తెలియ చేశారు. బాలకృష్ణ ప్రసాద్ మృతి తనకు దిగ్భ్రాంతి కలిగించిందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అన్నమయ్య సంకీర్తనలను స్వరపరచి శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన గొప్ప గాయకుడని కొనియాడారు. గరిమెళ్ల మృతి భక్తులతో పాటు సంగీత ప్రియులకు కూడా తీరని లోటు అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● మధుర గాయకుడు

మానవాళిని భక్తి మార్గంలో నడిపిన మధుర గాయకుడు బాలకృష్ణ ప్రసాద్ అని ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి పాండ్ర సురేంద్ర నాయుడు సంతాపం తెలిపారు. అన్నమయ్య సాహిత్యాన్ని తన గాత్రంతో అద్వితీయంగా భక్తులకు అందించిన గరిమెళ్ల భక్తకోటి హృదయాల్లో చిరస్మరణీయులుగా మిగిలిపోతారన్నారు. పది రోజుల క్రితం అకాడమీ ఫైన్ ఆర్ట్స్ నిర్వహించిన వేదికపై పాడటమే ఆయన చివరి కార్యక్రమమన్నారు. అకాడమీ సభ్యులు ప్రొఫెసర్ సూర్యారావు, కృష్ణమాచార్యులు, ప్రొఫెసర్ దేవసేన నాయుడు, ప్రొఫెసర్ కిరణ్‌క్రాంత్ చౌదరి, డాక్టర్ విభీషణ శర్మ, మనోహర్, శ్రీనివాసరావు గరిమెళ్ల మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు.





గరిమెళ్ల భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, కందారపు మురళి

● జిల్లా రచయితల సంఘం సంతాపం

గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు అని జిల్లా రచయితల సంఘం పేర్కొంది. టీటీడీ సంగీత విద్వాంసులుగా గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ ఎంతో కృషి చేశారని తెలిపారు. గరిమెళ్ల లేకపోయినా, వారి గాన మాధుర్యం సజీవంగా నిలుస్తుందని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్ సంతాపాన్ని తెలియ చేశారు. గరిమెళ్ల భౌతిక కాయానికి టీటీడీ మాజీ చైర్మెన్ కరుణాకరరెడ్డి, సీఐటీయూ నేత కందారపు మురళి, పలువురు సంగీత, సాహిత్య ప్రియులు నివాళులర్పించారు.

సంగీత ప్రపంచానికి తీరని లోటు : టీటీడీ చైర్మన్

తిరుమల, మార్చి9(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతిపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. సంప్రదాయ సంగీతానికి గరిమెళ్ల మృతి తీరని లోటు అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వెయ్యికి పైగా అన్నమాచార్య సంకీర్తనలకు స్వరకల్పన చేసిన ఘనత ఆయన సొంతమన్నారు.

టీటీడీ జేఈవో నివాళి

బాలకృష్ణప్రసాద్ భౌతికకాయానికి టీటీడీ జేఈవో వీరబ్రహ్మం నివాళి అర్పించారు. టీటీడీ సీపీఆర్వో రవి, అధికారులు, సిబ్బంది బృందంతో కలిసి తిరుపతిలోని ఆయన ఇంటికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు

● నరసింహ యాదవ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(వైద్యం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ పూర్తిగా కరువైందన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యతను ఇవ్వడమే కాకుండా రక్షణకు పక్కాగా చర్యలు తీసుకుంటోందన్నారు. మహిళలను అభివృద్ధిపథంలో నడిపించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఆశా వర్కర్లకు, అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు, అరియర్స్ పెంచాన్నారు. అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారన్నారు. కార్యక్రమంలో నేతలు కుమారి, హేమ, రేవతి, సుజాత, యశోద పాల్గొన్నారు.

హిందువులపై తప్పుడు కేసులు తగదు

● బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌నాయుడు



తిరుపతి(వైద్యం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో వీరభద్రస్వామి ఉత్సవాల్లో పోలీసులు ఒక వర్గానికి కొమ్ముకాస్తూ హిందూ భక్తులపై దాడులకు పాల్పడిన వారిని వదిలేసి బాధితులపైనే కేసులు నమోదు చేయడం అన్యాయమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన బీజేపీ నేతలతో కలిసి మాట్లాడారు... ఎస్పీ స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతీ పోలీసు అధికారి ఏకపక్షంగా బాధితులపైనే కేసులు నమోదు చేశారన్నారు. వార్తలు రావడంతో మరో 200 మంది హిందూ భక్తులు, విశ్వహిందూ పరిషత్‌కు చెందిన కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ నాయుడు హెచ్చరించడం శోచనీయమన్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలోకలెక్టరేట్ కార్యాలయాల ముందు సోమవారం ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు'ను విజయవంతం చేయండి

● భూమన కరుణాకర్‌రెడ్డి



పోస్టర్లను విడుదల చేస్తున్న కరుణాకర్‌రెడ్డి, మేయర్ శిరీష, మధుసూదన్‌రెడ్డి తదితరులు

తిరుపతి (రవాణా), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 12న చేపడుతున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం తన నివాసం వద్ద ఆయన యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శిం చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కళాశాలలకు చెల్లించకుండా చేతులు ఎత్తేయడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజులు కట్టుకోలేక, పరీక్షలు రాయలేక ఆత్మ హత్యకు చేసుకుంటున్నారన్నారు. ఈక్రమంలోనే యువత పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఆరోజు నిరసన వ్యక్తం చేసి కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, మార్చి9 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని 74,646 మంది దర్శించుకున్నారు. 30,769 మంది తలనీలాలు సమర్పించారు.

వాహన బేరర్లకు వస్త్రాల అందజేత



తిరుమల, మార్చి9 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఉత్సవమూర్తుల వాహనాలను మోసే టీటీడీ వాహన బేరర్లకు ఆదివారం ఓ భక్తుడు వస్త్రాలను అందజేశారు. తిరుమలలో వైభోత్సవ మండపంలో విజయవాడకు చెందిన నరయ్య అనే భక్తుడు 80 మంది వాహన బేరర్లకు వీటిని అందజేశారు. ఈసందర్భంగా దాత మీడియాతో మాట్లాడుతూ.. స్వామిని మోసే భాగ్యం పూర్వజన్మ సుకృతమన్నారు. ఈక్రమంలోనే వస్త్రాలను అందజేసినట్టు తెలిపారు.

తిరుమలలో అనధికార వ్యక్తుల విచారణ

తిరుమల, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేకుండా తిరుమలలో తిష్ట వేసిన అనధికర వ్యక్తులను ఆదివారం తిరుమల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శాంతిభద్రతలను కాపాడటంతో పాటు నేరాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు తిరుమల పోలీసులు, విజిలెన్స్ అధికారులు కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. 25 మంది ఎలాంటి సర్టిఫికెట్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్నట్టు గుర్తించారు. నేరచరిత్ర, ఆధారాలు లేకపోవడంతో తిరుపతికి పంపారు.

క్రికెట్ అభిమానుల సంబరాలు



బాణసంచా కాల్చుతున్న క్రీడాభిమానులు

తిరుపతి(క్రీడలు), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఇండియా ఐసీసీ చాంపియన్స్‌ట్రోఫీ గెల్చుకోవడంతో నగరంలో క్రీడాభిమానులంతా ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఆదివారం మధ్యాహ్నం 2.30గంటల నుంచి రాత్రి 9.45గంటలకు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. నగరంలోని క్రికెట్ అభిమానులతోపాటు ప్రజలతా టీవీలకు, భారీ స్క్రీన్స్, మొబైల్‌ఫోన్లకు అతుక్కుపోయారు. రోహిత్‌సేన బ్యాటింగ్‌తో న్యూజిలాండ్ జట్టుపై ఆరంభం నుండే ఎదురుదాడి చేయడంతో వీరి అనందానికి అవధులు లేవు. తర్వాత కొంద ఉత్కంఠ కొనసాగింది. చివరి ఓవర్ మిగిలి వుండగానే రవీంద్రజడేజా విన్నింగ్ షాట్‌గా ఫోర్ కొట్టడంతో అభిమానులు వీధుల్లో సంబరాలు చేసుకొన్నారు. స్వీట్స్ పంచుకున్నారు. రంగురంగుల టపాసులను పేల్చారు. నాలుగు కాళ్ల మండపం వద్ద బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

శాప్‌చైర్మన్ అభినందనలు

ఐసీసీ చాంపియన్స్‌ట్రోఫీని కైవసం చేసుకొని చరిత్ర సృష్టించిన భారత్ క్రికెట్‌జట్టుకు శాప్‌చైర్మన్ రవినాయుడు అభినందనలు తెలియజేశారు. భారత బౌలర్లు, బ్యాట్స్‌మెన్ల ప్రదర్శన్ భేష్ అన్నారు.

జీఎస్‌టీ ఆఫీసు సబార్డినేట్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక





శ్రీనివాసరావు, చెన్నకేశవులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేల్స్ ట్యాక్స్ ఆఫీసు సబార్డినేట్ల సంఘం (జీఎస్‌టీ) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని తిరుపతి జీఎస్‌టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర అధ్యక్ష పదవికి గోపాలకృష్ణ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో నూతనంగా ఆర్.శ్రీనివాసరావును(విజయవాడ) కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. వీరితో పాటు చెన్నకేశవులు(గుంటూరు) ప్రధాన కార్యదర్శిగా, ఆర్.సత్యనారాయణను కార్యాలయ కార్యదర్శిగా, జగన్నాధంను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మొత్తం 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ముందుగా ఎన్నికలు నిర్వహించాలని భావించినా ఆఖరి నిమిషంలో సభ్యులందరూ కలసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆఫీసు సబార్డినేట్ సిబ్బందికి రావాల్సిన సౌకర్యాలు, ఇతర ప్రయోజనాలపై ప్రభుత్వంతో చర్చించి న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి దాదాపు 100 మంది సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి టీటీడీ కార్మికుడి మృతి



మృతి చెందిన యానాదయ్య (ఫైల్ ఫొటో)

తిరుమల, మార్చి9(ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఓ కార్మికుడు తీవ్రంగా పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. తిరుపతికి చెందిన యానాదయ్య(59) టీటీడీ అటవీ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం ట్రాక్టర్‌లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ ఒక్కసారిగా కిందపడ్డారు. టాక్టర్ వెనుక చక్రాలు అతని కాళ్లపై ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అశ్విని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు స్విమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అతడు సాయంత్రం మృతి చెందారు.

రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి: సీఐటీయూ

ఉద్యోగి మృతి విషయాన్ని తెలుసుకున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి స్విమ్స్ ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం,ఆయన కుటుంబంలో ఒకరికి టీటీడీలో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బస్‌షెల్టర్ నిర్మించండి



బస్‌షెల్టరు లేకపోవడంతో ఎండలో నిరీక్షిస్తున్న గ్రామస్తులు

గూడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతదాసుపల్లి రోడ్డు వద్ద బస్‌షెల్టర్ లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గూడూరు - మిటాత్మకూరు ప్రధాన రహదారి నుంచి సంతదాసుపల్లెకు అర్ధ కిలోమీటరు దూరం వెళ్లాల్సి ఉంటుంది. సంతదాసుపల్లె నుంచి గూడూరు పట్టణానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో అర్ధ కిలోమీటరు ప్రయాణించి ప్రధాన రహదారిపైకి చేరుకోవాలి. అక్కడ నుంచి మిటాత్మకూరు బస్సుల్లో గూడూరు చేరుకోవాల్సి ఉంటుంది. ప్రధాన రహదారిపై బస్‌షెల్టర్ లేకపోవడంతో ఎండ, వానతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గూడూరు - మిటాత్మకూరు రహదారిపై సంతదాసుపల్లె రోడ్డు వద్ద బస్‌షెల్టర్ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేదల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులను అందుకున్న వారితో ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రమేష్, పెరుమాల్, మాధవ నాయుడు తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పేదలకు ఆరోగ్య రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొంటుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. నియోజకవర్గంలోని 19 మందికి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.24 లక్షల చెక్కులను ఎమ్మెల్యే ఆదివారం తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య చేయించుకొన్న వారికి కూడా సీఎం సహాయ నిధి కింద సాయం అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చవ మాధవ నాయుడు, చిట్టేటి పెరుమాల్, కామిరెడ్డి మురళీ రెడ్డి, బొమ్మన్ పళణి, విజయ నాయుడు, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

వెంకటగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలోని 55 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను రూ.60 లక్షల చెక్కులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదివారం అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, నాయకులు కాపా శ్రీనివాసులు, ఊటుకూరు దశయ్య, తిరుపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, జగదల నాయుడు, సోమయ్య, మోహన్‌కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలను పరిష్కరించాలి



ముగ్గుల పోటీలను తిలకిస్తున్న ఐద్వా అధ్యక్షురాలు చంద్రకళ

నాయుడుపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో మహిళల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని మహిళా సంఘం(ఐద్వా) అధ్యక్షురాలు చంద్రకళ అన్నారు. నాయుడుపేట పట్టణంలోని భూపయ్య కాలనీలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మణెమ్మ, రజక సంఘం నాయకులు పుట్టయ్య, వెంకటేశ్వర్లు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టరు విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జంపాల ప్రకాష్ తదితరులు

డక్కిలి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టరును ఆ పార్టీ వెంకటగిరి ఇన్‌చార్జి జంపాల ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈనెల 14న పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు వెంకటగిరి నియోజకవర్గం నుంచి భారీగా జనసమీకరణ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జనసే జిల్లా కార్యదర్శి చామండి రాధమ్మ, నాయకులు చిరంజీవులు, నలుబోలు సాయి, బిక్కి చింరంజీవులు బాబు, శెట్టిపల్లి సుధీర్, చిన్నా, సుధ, పన్నీర్, రాజమోహన్, సర్దార్, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి టీటీడీ కార్మికుడి మృతి

తిరుమల, మార్చి9(ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఓ కార్మికుడు తీవ్రంగా పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. తిరుపతికి చెందిన యానాదయ్య(59) టీటీడీ అటవీ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం ట్రాక్టర్‌లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ ఒక్కసారిగా కిందపడ్డారు. ట్రాక్టర్ వెనుక చక్రాలు అతని కాళ్లపై ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అశ్విని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు స్విమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అతడు సాయంత్రం మృతి చెందారు.

అమ్మవారి సేవలో కేంద్రమంత్రి ఎస్పీసింగ్ బఘేల్

తిరుచానూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారిని ఆదివారం కేంద్రమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి, అనంతరం సన్నిధిలో అమ్మవారి మూలవర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



ఆలయం వద్ద కేంద్రమంత్రి ఎస్పీసింగ్ బఘేల్

బైక్‌ను ఢీకొన్న లారీ
యువకుడి దుర్మరణం



అంకయ్య (ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గున్నాగుంట రోడ్డు మలుపు వద్ద ఆదివారం సాయంత్రం మోటర్ బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో బందిల అంకయ్య(22) దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు... వాకాడు మండలం గొల్లపాళెం గ్రామానికి చెందిన కిష్టయ్య, శ్యామల దంపతుల కుమారుడు అంకయ్య నాయుడుపేట నుంచి మోటర్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అంకయ్య తల పగిలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అంకయ్య మోటర్ బైక్ వెనుక వస్తున్న ఆటోను కూడా లారీ ఢీకొట్టబోగా డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఏఎస్‌ఐ నాగేశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అంకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పరారయ్యాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నేడు పలు రైళ్ల రద్దు

తడ, మార్చి 9 (ఆంధ్రజోతి): తమిళనాడు రాష్ట్రం కవరేపేట - పొన్నేరు మధ్య పట్టాల మార్పిడి పనులు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే అధికారులు ప్రకటించారు. గత నెల రోజులుగా కవరేపేట - పొన్నేరు మధ్య ఇంజనీరింగ్ పనులు జరుగుతుండడంతో పలు మార్లు రైళ్ల రాకపోకలను నిలివేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో సోమవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పనులు చేపట్టాలని సదరన్ రైల్వే అధికారులు నిర్ణయించారు. దీంతో సూళ్లూరుపేట - చెన్నై మధ్య నడిచే పలు సబర్బన్ రైళ్లు రద్దు చేయగా, మరికొన్ని రైళ్లు పొన్నేరు వరకు నడిపి తిప్పి పంపనున్నారు. అలాగే సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.50 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు, నెల్లూరు నుంచి సూళ్లరుపేటకు సాయంత్రం 6.45 నిమిషాలకు బయలుదేరి వచ్చే మెమూ రైలును పూర్తిగా రద్దు చేశారు.

తెలుగంగ కాలువలో మృతదేహం

బాలాయపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామకూరు సమీపంలోని తెలుగంగ కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించి పోలీసులకు సమాచారం అదించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉండవచ్చని, బులుగురంగు చొక్కా, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టుకు మరమ్మతులు చేయండి



కల్వర్టు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

గూడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాయుడుకాలువకట్ట ప్రాంతంలో కల్వర్టు ధ్వంసమైంది. కల్వర్టుకు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడడంతో వీధిలోకి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయంలో గొయ్యి కనిపించక వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

గూడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దచర్చి సమీపంలో ఆదివారం మహ్మద్ ఫక్రుద్దీన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు మగ్దూం, అన్వర్, రెహమాన్, కరిముల్లా, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఆఫీసు సబార్డినేట్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక





శ్రీనివాసరావు, చెన్నకేశవులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేల్స్ ట్యాక్స్ ఆఫీసు సబార్డినేట్ల సంఘం (జీఎస్టీ) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని తిరుపతి జీఎస్టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర అధ్యక్ష పదవికి గోపాలకృష్ణ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో నూతనంగా ఆర్. శ్రీనివాసరావును(విజయవాడ) కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. వీరితో పాటు చెన్నకేశవులు(గుంటూరు) ప్రధాన కార్యదర్శిగా, ఆర్‌సత్యనారాయణను కార్యాలయ కార్యదర్శిగా, జగన్నాధంను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మొత్తం 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ క్రమంలో ముందుగా నూతన కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించాలని భావించినా ఆఖరి నిమిషంలో సభ్యులందరూ కలసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆఫీసు సబార్డినేట్ సిబ్బందికి రావాల్సిన సౌకర్యాలు, ఇతర ప్రయోజనాలపై ప్రభుత్వంతో చర్చించి న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి దాదాపు 100 మంది సభ్యులు పాల్గొన్నారు.

చెలరేగుతున్న మట్టి మాఫియా

మంగళంపాడు చెరువులో అక్రమ తవ్వకాలు

సూళ్లూరుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మట్టి మాఫియా మళ్లీ చెలరేగిపోతోంది. ఎలాంటి అనుమతులూ లేకుండా చెరువులను సైతం తవ్వేస్తున్నారు. మంగళంపాడు చెరువులో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజామున వరకు ఎక్స్‌కవేటర్ల ద్వారా మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా సూళ్లూరుపేటలో పలు వెంచర్లకు తరలించారు. ఇప్పటికే పది అడుగులకు పైగా లోతు తవ్వేశారు. ఈ చెరువులో దొరికే మట్టి, గ్రావెల్ నాణ్యతగా ఉండడంతో టిప్పర్ రూ.13 వేల నుంచి 15వేల వరకు, ఒక ట్రాక్టర్ ట్రక్కు రూ.వెయ్యి వరకు పలుకుతోంది. ఈ అ క్రమ దందాలో వైసీపీ నేతలే ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి అధికారుల సహకారం కూడా ఉందన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది.



మంగళంపాడు చెరువులో తవ్వేయడంతో ఏర్పడిన గుంతలు

సీజేఎఫ్‌ఎస్ భూములకు పట్టాలివ్వండి



జయంపులో సీజేఎఫ్ఎస్ భూముల్లో నిమ్మ సాగు

బాలాయపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీజేఎఫ్ఎస్ భూములకు పట్టాలివ్వాలని సాగుదారులు కోరుతున్నారు. మండలంలోని అంబలపూడి, అరిగేపల్లి, చిలమనూరు, చుట్టి, గొల్లగుంట, జయంపు. నిడిగల్లు, పెరిమిడి, సుబ్రమణ్యం, ఊట్లపల్లి, కడగుంట గ్రామాల్లో రైతులు కోఆపరేటివ్ జాయింట్ పార్మింగ్ సొసైటీ ఆధ్వర్యంలో భూములను సాగు చేసుకునేవారు. అయితే సదరు భూములపై సాగుదారులకు ఎటువంటి హక్కులు లేకపోవడంతో ఎలాంటి రుణాలు పొందలేని పరిస్థితి. మరికొందరు అప్పులు చేసి పంటలు సాగు చేస్తుండగా, కొందరు పెట్టుబడి ఖర్చులకు డబ్బులు లేక భూములను బీడుగా వదిలేశారు. కుంటున్నారు. ఈ నేపథ్యంలో రైతుల విజ్ఞప్తి సదరు భూములపై హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఇందులో భాగంగా 2018లో సీజేఎఫ్‌ఎస్‌లను రద్దు చేసి అసైన్డ్ మెంట్ పట్టాలు మంజూరు చేసేందుకు శ్రీకారం చుట్టింది. అయితే సీజేఎఫ్ఎస్ భూములు రికార్డుల్లో అడవిగా నమోదై ఉండడం, అదే సమయంలో ఎన్నికలు రావడంతో పట్టాల మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి సీజేఎఫ్ఎస్ భూములకు పట్టాలివ్వాలని సాగుదారులు కోరుతున్నారు.

శేష వాహనంపై వేణుగోపాల స్వామి



సూళ్లూరుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడులోని సౌందర్యవల్లీ రుక్మిణీ సత్యభామా గోదా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి ఆదివారం స్వామివారు చిన్నశేష వాహనంపై ఊరేగారు. రాత్రి హంస వాహనంలో కొలువుదీరారు. ఉదయం ఆలయంలో శెల్వస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. ఉభయకర్తలుగా రాజా మొదలి, వెంకటేష్ మొదలి కుటుంబసభ్యులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకొన్నారు.

కోటమ్మకు పూజలు



కోట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. పండితులు అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యామ్మకు ఆదివారం పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

మద్యం షాపును తరలించండి



ఎమ్మెల్యే విజయశ్రీకి సమస్య వివరిస్తున్న మహిళలు

సూళ్లూరుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తడ పంచాయతీలోని తడ దళితవాడ ప్రాంతంలో ఐఎంసీసీ పరిశ్రమకు వెళ్లే మార్గంలో ఉన్న మద్యం షాపును అక్కడి నుంచి తరలించేలా చూడాలని స్థానిక మహిళలు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి మొరపెట్టుకున్నారు. అక్కడ మద్యం షాపు ఉండడం వల్ల ఆ మార్గంలో కంపెనీలకు వెళ్లే మహిళల పట్ల తాగుబోతులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి మద్యం షాపును తరలించేలా చూస్తామన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నందగోపాల్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, మార్చి 9 (ఆంధ్రజోతి): మండలంలోని అక్కగారిపేటకు చెందిన ఇలుపూరు నందగోపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన చిత్రపటానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నందగోపాల్ తండ్రి గోవర్దన్, సోదరుడు నానిజితేంద్రను పరామర్శించారు. నరేంద్రరెడ్డి వెంట బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, గోగుతోటి మురళీ తదితరులు ఉన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని 74,646 మంది దర్శించుకున్నారు.

అరుంధతీయపాళెంలో కార్డన్ సెర్చ్



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ శేఖర్‌బాబు

గూడూరు అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంధతీయపాళెంలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని 13 బైక్‌లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శేఖర్‌బాబు మాట్లాడుతూ నేరాలను నియంత్రించేందుకు, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నక్క చెరువుకు గంగ జలాలు



స్వర్ణముఖి నది నుంచి పెన్నక్క చెరువుకు వెళుతున్న గంగ జలాలు

కోట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని గూడలి స్వర్ణముఖినది నుంచి నెల్లూరు పల్లి కొత్తపాలెం వద్ద ఉన్న పెన్నక్క చెరువుకు తెలుగు గంగ జాలలు వెళుతున్నాయి. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చొరవతో కండలేరు నుంచి 240 క్యూసెక్కుల గంగ జలాలను 7వ బ్రాంచ్ కెనాల్ ద్వారా పెన్నక్క చెరువులోకి మళ్లించారు. దీంతో చెరువు కింద ఉన్న 8500 ఎకరాల ఆయకట్టు భూముల్లో ఈఏడాది ఎడగారు వరిసాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

ఉపాధి పనులతో పంట కాలువలు బాగు



పంట కాలువలను శుభ్రం చేస్తున్న కూలీలు

పెళ్లకూరు, మార్చి 9 (ఆంధ్రజోతి): ఉపాధి పనులతో సాగునీటి చెరువులకు నీరందించే పంట కాలువలు, వాగులు, వంకలకు మోక్షం కలుగుతున్నాయి. మండలంలో తెలుగుగంగ, స్వర్ణముఖినది నుంచి సాగునీటి చెరువులకు, కుంటలకు నీరందించే పంట కాలువలు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాలతో నిండిపోయి పూడుకుపోయాయి. ఉపాధి పథకం కింద చెరువుల గట్లు, పంట కాలువలు, వాగుల్లో చెత్తా చెదారాలను తొలగించడంతో పాటు పూడికతీత పనులను చేపట్టారు.

తిరుచ్చిపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు



చంద్రగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకట్ల కైంకర్యాలు పూర్తయ్యాక పునర్వసు నక్షత్రం సందర్భంగా సాయంత్రం కన్నుల పండువగా ఉత్సవర్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేసి మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి, భక్తులు సిబ్బంది పాల్గొన్నారు. చంద్రగిరిలోని కోదండరామాలయంలో సీతారామలక్ష్మణ సమేత హనుమ ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో పార్థసారథి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణయ్య, అర్చకులు శ్రీనివాసబట్టర్, నరసింహన్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలలో అనధికార వ్యక్తుల విచారణ

తిరుమల, మార్చి9 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేకుండా తిరుమలలో తిష్ట వేసిన అనధికార వ్యక్తులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేరాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు తిరుమలలో పోలీసులు, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 25 మంది ఎలాంటి సర్టిఫికెట్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్నట్టు గుర్తించారు. వారికి నేరచరిత్ర, ఆధారాలు లేకపోవడంతో తిరుపతికి పంపారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన టెన్త్‌ ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాల బాక్సులను పరిశీలిస్తున్న పోలీసులు, విద్యాశాఖ అధికారులు

కేవీబీపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు ఆదివారం కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. వీటిని కాన్ఫిడెన్షియల్‌ వెంకటపట్నప్పయ్య ఆధ్వర్యంలో స్టేషన్‌లో భద్రపరిచారు. మండలంలో పది ఉన్నత పాఠశాలలకు చెందిన 450మంది విద్యార్థులు ఈ యేడాది పబ్లిక్‌ పరీక్షలకు హాజరు కానున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. **బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి):** టెన్త్‌ పబ్లిక్‌ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు స్థానిక పోలీసుస్టేషన్‌కు ఆదివారం చేరాయి. ఈ సందర్భంగా ఎస్‌ఐ విశ్వనాథనాయుడు పర్యవేక్షణలో పరీక్ష చీఫ్‌ సూపరింటెండెంట్లు రూపేష్‌ కుమార్‌, గిరిజ, డిపార్ట్‌మెంట్‌ అధికారులు శ్రీనివాసులు, ఆదిశేషయ్య పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. బీఎన్‌కండ్రిగలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఏ, బీ సెంటర్లలో 306 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వల్లమాంబపురం, పల్లమాల, బీఎన్‌కండ్రిగ, నెలవాయి పాఠశాలలతో పాటు ప్రైవేట్‌ పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

నిజాయితీ, అభివృద్ధికి మారుపేరు బొజ్జల కుటుంబం



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుమహిళలు

శ్రీకాళహస్తి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీకి బొజ్జల కుటుంబం మారు పేరని.. నియోజకవర్గం అభివృద్ధి అంటే వారే గుర్తుకు వస్తారని తెలుగుమహిళా నేతలు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్‌ భవన్‌లో వారు మాట్లాడుతూ.. టీడీపీ ఆవిర్భావం నుంచి బొజ్జల కుటుంబం పార్టీలోనే ఉందన్నారు. ఐదేళ్లకు ఓ పార్టీ మారే ఎస్సీవీనాయుడు ఏనాడు టీడీపీ శ్రేణులకు భరోసా కల్పించలేదన్నారు. తన స్వార్థం కోసం పార్టీలు మారి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని తెలిపారు. ఇప్పటికైనా బొజ్జల సుధీర్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని బుద్ధి చెప్పాల్సిన వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, సుమతి, సుప్రజ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

పుత్తూరు అర్బన్‌, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ అధికారులకు సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎండలు రోజురోజుకూ తీవ్రతరం అవుతున్నాయన్నారు. ప్రజలు బయట తిరిగే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎక్కడెక్కడ నీటి కొరతలు ఉన్నాయో ఆ ప్రాంతాల్లో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

హైందవ పరిరక్షణకు పాటుపడదాం



సమావేశంలో పాల్గొన్న బ్రాహ్మణ సంక్షేమ సమైక్య సభ్యులు

పుత్తూరు అర్బన్‌, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఐక్యంగా ఉండి హైందవ పరిరక్షణకు పాటుపడదామని బ్రాహ్మణ సంక్షేమ సమైక్య రాష్ట్ర క్రమశిక్షణ మండలి అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అజయ్‌కుమార్‌ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా సమైక్య గౌరవ అధ్యక్షుడు అలూరు రామకృష్ణ, జిల్లా కార్యనిర్వాహణాధికారి వేదం హరిప్రసాద్‌ అధ్యక్షతన తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమైక్య సమావేశం స్థానిక గాయత్రి బ్రాహ్మణ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా బ్రాహ్మణులపై దాడులను అజయ్‌కుమార్‌ ఖండించారు. శ్రీకాళహస్తిలో వేద పండితులను విధుల నుంచి అన్యాయంగా తొలగించడం, అన్నమయ్య జిల్లా రాయచోటిలో రాముల వారి ఊరేగింపులో అర్చకుడిపై చేయి చేసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఈ అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. అనంతరం సమైక్య జిల్లా అధ్యక్షుడు రాముశర్మ, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి, సూళ్లూరుపేట, గూడూరు, చంద్రగిరి నియోజకవర్గాల నుంచి బ్రాహ్మణ సంక్షేమ సమైక్య సభ్యులు హాజరయ్యారు.

రాస్‌ సేవలు అభినందనీయం



గర్భిణులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్‌

పుత్తూరు టౌన్‌, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా తీర్చిదిద్దుతున్న రాష్ట్రీయ సేవా సమితి(రాస్‌) సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ అన్నారు. పట్టణంలోని ఏఎంసీ కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. రాజకీయాల్లో కాకుండా రాస్‌ లాంటి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సమాజ సేవ చేయవచ్చన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా వికలాంగులకు చేతికర్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులకు సీమంతం నిర్వహించారు. జన శిక్షణ్‌ సంస్థాన్‌ ఆధ్వర్యంలో కుట్టు మెషిన్లు అందజేశారు. రాస్‌ ప్రధాన కార్యదర్శి వెంకట రత్నం, యూనియన్‌ బ్యాంకు మేనేజర్‌ హరిత, పద్మశాలి కార్పొరేషన్‌ డైరెక్టర్‌ మాధవయ్య, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ యుగంధర్‌, జడ్పీటీసీ మాజీ సభ్యుడు దేవానందమునాయుడు, ప్రసాద్‌, భాస్కరన్‌, రాస్‌ డైరెక్టర్లు నాగరాజు, హరి, రవి పాల్గొన్నారు.

పుష్పరథంపై స్కందుడి విహారం



పుత్తూరు టౌన్‌, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో కొలువై ఉన్న వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్వామి ఆలయ 53వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పుష్పరథంపై దేవేరులతో స్వామివారు ఊరేగారు. ఆదివారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం పుష్పరథంపై అమ్మవార్లతో కలిసి స్వామివారు ఊరేగగా భక్తులు కర్పూర హారతులు పట్టారు.

అంగన్‌వాడీల అరెస్టు అన్యాయం



పుత్తూరు టౌన్‌, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న చలో విజయవాడ ఆందోళన కార్యక్రమానికి వెళ్లకుండా అంగన్‌వాడీలను, సీఐటీయూ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని సీఐటీయూ పుత్తూరు పట్టణ కార్యదర్శి వెంకటేష్‌ పేర్కొన్నారు. ఆదివారం వెంకటేష్‌ సహా పుత్తూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలను పుత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు.

కల్వర్టును ఢీకొన్న లారీ: తృటిలో తప్పిన పెనుప్రమాదం



పుత్తూరు అర్బన్‌, మార్చి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరుగురాజుపాళెం సమీపంలో లారీ కల్వర్టును ఢీకొంది. శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. గుజరాత్‌ నుంచి చెన్నైకి వెళుతున్న నెం. టీఎన్‌ 28 బీహెచ్‌ లారీ డ్రైవర్‌ ప్రైవేటు ట్రావెల్‌ బస్సును తప్పించే క్రమంలో కల్వర్టును ఢీకొంది. ఈ ఘటనపై హైవే పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రేణిగుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని కల్లూరు క్రాస్‌ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో స్పెషల్‌ బ్రాంచ్‌ పోలీసులు దాడి నిర్వహించారు. వారి నుంచి రూ.2.10 లక్షలు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

బాలుర గురుకులం అప్‌గ్రేడ్‌ ఎప్పుడు?



సత్యవేడు ఎంజేపీబీ గురుకుల పాఠశాల

సత్యవేడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మా జ్యోతీబా పూలే బాలుర గురుకుల పాఠశాల జూనియర్‌ కళాశాలగా అప్‌గ్రేడ్‌ చేయాలన్న ప్రతిపాదన ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితం కావడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు నిరాశ చెందుతున్నారు. పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాలను 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఎన్‌. శివప్రసాద్‌ చొరవతో స్థానిక ఎన్‌. ఎంకండిగ మిట్ట వద్ద తెలుగు గంగ పురాతన కార్యాలయ గదుల్లో ఏర్పాటు చేశారు. 50 మంది విద్యార్థులతో చిన్నపాటి రేకుల షెడ్డులో అరకొర వసతులతో ప్రారంభమైన గురుకుల పాఠశాల అంచెలంచెలుగా ఎదిగి పేద విద్యార్థుల పాలిట వరంగా మారింది. ఇక్కడ విద్యనభ్యసించిన ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత స్థానాలను ప్రసాదించిన ఘనత ఈ పాఠశాల సొంతం. ప్రస్తుతం పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడప తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల అంకితభావం, సిబ్బంది సమష్టి కృషితో యేటా టెన్త్‌ పబ్లిక్‌ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తుండడం విశేషం. అయితే పాఠశాలను జూనియర్‌ కళాశాలగా అప్‌గ్రేడ్‌ చేయాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చకుండా తీరని లోటుగా మారింది. దీంతో పాఠశాల విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి పాఠశాలకు 2021లో జూనియర్‌ కళాశాలగా అప్‌గ్రేడ్‌ చేస్తూ అప్పటి వైసీపీ ప్రభుత్వం గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చింది. అయితే వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన అప్పటి మంత్రి అడ్డుతగిలి తన నియోజకవర్గంలోని పాఠశాలకు మార్చుకున్నారు. దీంతో సత్యవేడు గురుకుల పాఠశాల అప్‌గ్రేడ్‌ ఫైల్‌ మరుగున పడింది. ఈ పాఠశాలను జూనియర్‌ కళాశాలగా అప్‌గ్రేడ్‌ చేస్తే జిల్లాకు మారుమూలగా ఉన్న సత్యవేడు ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వంలోనైనా సంబంధిత ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో కృషి చేసి సత్యవేడు బాలుర గురుకుల పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్‌ చేయాల్సి ఉంది.

చలో విజయవాడను విజయవంతం చేయండి

వరదయ్యపాళెం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న చలో విజయవాడను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మండలకేంద్రంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 82 వేలమందికి పైగా మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారికి వేతనం రూ.3వేలన్నారు. ఇందుకు 8గంటలు పని చేయాల్సి వస్తోందన్నారు. వీరికి కనీస వేతనం రూ.10వేలు, ఈఎస్‌ఐ, పీఎఫ్‌, హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలన్నారు. ఈనెల 19న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికసంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల నిరవధిక సమ్మె

తిరుపతి రూరల్‌, మార్చి9(ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యార్థులతో సమానంగా స్టైపండ్‌ పెంచాలని ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారమూ కొనసాగింది. వర్శిటీ ప్రధానగేటు ఎదురుగా దీక్షా శిబిరంలో విద్యార్థులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. లైవ్‌స్టాక్‌ రంగం ద్వారా ప్రభుత్వానికి రూ.60వేల కోట్ల జీడీపీ వస్తుందని,ఇందుకు వెటర్నరీ విద్యార్థులకు మాత్రం రూ.7వేల స్టైపండ్‌ని అందిస్తున్నారని ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారు. 13సంవత్సరాలుగా రూ.7వేలు మాత్రమే స్టైపండ్‌ ఇస్తున్నారన్నారు. తక్షణమే పెంచి తమకు న్యాయం చేయాలని విద్యార్థులు కోరారు.

టీ సమయానికి మందు రెడీ!

పర్మిట్‌ రూంలో తెల్లవారే మద్యం అమ్మకాలు ● పట్టించుకోని ఎక్సైజ్‌ శాఖ అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల పక్కన నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన పర్మిట్‌ రూంలో టీ తాగే సమయానికే మద్యాన్ని విక్రయిస్తున్నారు. వాస్తవానికి ఉదయం 10 గంటల తరువాత మద్యం విక్రయించాల్సి ఉంది. పట్టణంలోని ఎస్‌వీఎల్‌ వైన్‌ షాపులో తెల్లవారుజామున నుంచే మద్యాన్ని విక్రయిస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి విక్రయాలు సాగిస్తున్నా.. ఎక్సైజ్‌ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మద్యం దుకాణదారులే పర్మిట్‌ రూంని అడ్డాగా చేసుకుని విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారు. మండలంలో 10మద్యం దుకాణాలు దక్కించుకున్న యాజమానులు ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. తెల్లవారుజామున 6 గంటలకే దుకాణాలు తెరిచి విక్రయాలు ప్రారంభిస్తున్నారు. రాత్రి షట్టర్‌ కిందకు దించి లైట్‌ వేసుకుని విక్రయిస్తున్నారు. దీనిపై ఎక్సైజ్‌ సీఐ నర్సానాయుడిని వివరణ కోరగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధ్వానంగా ప్రభుత్వాస్పత్రి లింకురోడ్డు



గుంతలు, మిట్టలతో ఉన్న ప్రభుత్వాస్పత్రి లింకు రోడ్డు

శ్రీకాళహస్తి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నై రోడ్డు నుంచి ప్రభుత్వాస్పత్రి రోడ్డుకు చేరే లింకు రోడ్డు అధ్వానంగా మారింది. పట్టణ శివార్లలోని చెన్నై రోడ్డు నుంచి ప్రభుత్వాస్పత్రికి చేరుకోవడానికి ఈ లింకు రోడు కీలకం. అలాగే చెన్నై రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండుకు చేరుకోవడానికి కూడా ఈ మార్గం అనువైంది. ఈ లింకు రోడ్డుకు సమీపంలో ఇటీవల పెద్దఎత్తున బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారు. అదే విధంగా చెన్నై రోడ్డులోని సాయినగర్‌కాలనీ, ఈదులగుంట, ఎల్‌బీనీ కాలనీ, బికెపావారికండ్రిగ ప్రాంతాల ప్రజలు ఈ రోడ్డు మీదుగా పట్టణానికి రాకపోకలు సాగిస్తున్నారు. ఇది పూర్తిగా దెబ్బతినింది. రాత్రివేళల్లో తరచూ ద్విచక్ర వాహనదారులు, సైకిలిస్టులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతులను ఆదుకుంటున్న ధాన్యం గోదాము సముదాయం



కేవీబీపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి వద్ద ఇటీవల కోవనూరు రైతు సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నాబార్డు నిధులతో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాము రైతులను ఆదుకుంటోంది. 500 మెట్రిక్‌ టన్నులను నిల్వ ఉంచే ఈ సముదాయం కేంద్రం ద్వారా రైతులు పండించిన పంట ఎండ, వానల నుంచి నిల్వ చేసుకుంటున్నారు. వారికి సరైన ధర అందుబాటులోకి వచ్చినపుడే విక్రయించడానికి వెసులుబాటు ఉంది. గోదాము నిర్మాణంపై మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముక్కంటి సేవలో వాసుకి నందన్‌



శ్రీకాళహస్తి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని ఆదివారం ప్రముఖ సినీనటి వాసుకి నందన్‌ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అంగన్‌వాడీ బుజ్జమ్మకు జాతీయ పురస్కారం



శ్రీకాళహస్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గరాజుపల్లెకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త బుజ్జమ్మ జాతీయ స్థాయిలో ప్రశంసాపత్రం అందుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు క్రమ తప్పకుండా హాజరయ్యేలా పర్యవేక్షించడం, పౌష్టికాహారం పంపిణీ, సులభతరంగా బోధించడంతో జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుజ్జమ్మ జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ మేరకు శనివారం ఢిల్లీలో ఉత్తమ సేవ పురస్కారాన్ని అందుకున్నారు.

విద్యుదాఘాతంతో ఇంటి సామగ్రి దగ్ధం



వరదయ్యపాళెం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలమత్తూరు పంచాయతీకి చెందిన బిషప్‌ ఇంట్లో శనివారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. బిషప్‌ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గుర్తించిన కుటుంబసభ్యులు వెలుపలకు పరుగులు తీశారు. మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. సుమారు రూ.8లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. సర్పంచ్‌ ప్రవీణ్‌ ఈ విషయాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి తీసుకెళ్లగా తక్షణ సాయం అందించాలని తహసీల్దారు రాజశేఖర్‌ను కోరారు. తహసీల్దారు సూచనలతో వీఆర్వో రమణయ్య తక్షణ సాయంగా రూ.5వేలు, 20 కిలోల బియ్యం అందించారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేద్దాం



శ్రీకాళహస్తి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేద్దామని ఆ పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఈనెల 14న జరగనున్న ఆవిర్భావ సభ సన్నాహక సమావేశం నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. జనసైనికులు, వీరమహిళలు సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. దండి రాఘవయ్య, కుమార్‌, మహేష్‌, గరికపాటి చంద్ర, ప్రతాప్‌, సుధాకర్‌, ప్రసాద్‌, వేణు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుత్తేరి గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనను ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ గోపురానికి కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. వీరయ్య, నాగర్జున, పల్లయ్య, వెంకటయ్య, సుబ్బయ్య, రవి, నవీన్‌, అశోక్‌కుమార్‌ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

వరదయ్యపాళెం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్‌ గుత్తి త్యాగరాజు పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. సూళ్లూరుపేటకు చెందిన శ్రీ రామలింగ చౌడేశ్వరీదేవి మహిళా సేవా సంఘం గౌరవాధ్యక్షురాలు పద్మజ, శ్రీనివాసులు దంపతులు వాటిని వితరణ చేశారన్నారు. సర్పంచు జ్యోతి, వైస్‌ సర్పంచ్‌ బిచంద్రబాబు, సామర్ల హరి, ఈశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

రేణిగుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని మహిళ తీవ్ర గాయాలు పాలైన సంఘటన శనివారం అర్ధరాత్రి రేణిగుంట తిరుపతి మార్గంలోని రైల్వే ఆస్పత్రి వద్ద జరిగింది. రైల్వే ఉద్యోగి కార్తీక్‌, తల్లి ఉషారాణి (55) శనివారం అర్ధరాత్రి రైల్వే హస్పిటల్‌ నుంచి ద్విచక్ర వాహనంలో రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి వస్తున్న ఆటో ఢీ కొంది. ఈ ఘటనలో ఉషారాణి తలకు తీవ్ర గాయాలయ్యాయి. కార్తీక్‌ స్వల్పంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఉషారాణిని నారాయణాద్రి ఆస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో స్విమ్స్‌కు తీసుకెళ్లారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్‌ చెప్పారు.

ఆక్రమణలో పేరిందేశం శ్మశానం



ముళ్లకంపలతో నిండిన శ్మశానం

కేవీబీపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరిందేశానికి చెందిన శ్మశాన వాటిక ఆక్రమణకు గురైంది. మృతదేహాలను పూడ్చాలంటే జాగా లేదు.. మోసుకెళ్లాలంటే దారిలేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్లుగా పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి శ్మశానాన్ని సర్వే చేసి హద్దులు చూపించాలని విన్నవించుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఉన్న కాస్త జాగాలో ముళ్ల చెట్లు పెరిగిపోయాయన్నారు. అధికారులు స్పందించి పెరిందేశం శ్మశాన వాటికను సర్వే చేసి హద్దులు చూపించి దారి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.